క్లుప్తంగా

క్రీడా పోటీల్లో రాణించిన పంగిడిగూడెం విద్యార్థి



ప్రశంసా పత్రం అందిస్తున్న ఏడీ రాకడ మణి

ఏలూరు (టూటౌన్): ఈనెల ఒకటో తేదీన ఏలూరు ఇండోర్ స్టేడియంలో జరిగిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీల్లో ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రతిభ కనబర్చాడు. షాట్‌పుట్ సీనియర్ విభాగంలో కె.పవన్ కుమార్ ప్రథమస్థానం, జావెలిన్ త్రోలో ప్రథమ స్థానం సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం పి.సురేష్ తెలిపారు. దీనికి సంబంధించి ప్రశంసా పత్రం, బహుమతిని మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని విభిన్న ప్రతిభావంతుల జిల్లా కార్యాలయం నందు ఏడీ పి.రాకడ మణి పాఠశాల హెచ్‌ఎం సురేష్, పీఈటీ మల్లయ్యకు అందజేశారు.

వేలం పాట వద్దంటూ గ్రామస్తుల ధర్నా

గణపవరం: గణపవరం మండలం జల్లికాకినాడలోని మంచినీటి చెరువును చేపల పట్టుబడికి వేలంపాట నిర్వహించవచ్చని గ్రామానికి చెందిన కొందరు మంగళవారం ఆందోళన నిర్వహించారు. గ్రామంలోని దూడల చెరువులోని చేపల పట్టుబడికి కోసం వేలం నిర్వహించాలని గ్రామ పంచాయతీ నిర్ణయించింది. ఈమేరకు రెండు రోజులుగా చెరువులోని నీటిని బయటకు తోడుతుండటంతో మంగళవారం గ్రామస్తులు చెరువు వద్దకు వచ్చి ఆందోళన నిర్వహించారు.

జల్ జీవన్ మిషన్‌తో తాగునీటి సమస్యకు పరిష్కారం

భీమడోలు: ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన మంచినీటిని అందించడమే జల్ జీవన్‌మిషన్ లక్ష్యమని పూళ్ల సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్ అన్నారు. పూళ్ల పంచాయతీ శివారు ఎంఎంపురం గ్రామానికి జల్ జీవన్‌మిషన్ పథకంలో రూ.20 లక్షలు మంజూరయ్యాయి. దీనిలో రూ.10 లక్షలతో ఏర్పాటు చేయనున్న మైక్రో ఫిల్టర్ నిర్మాణ పనులకు మంగళవారం సర్పంచ్ శంకుస్థాపన చేసారు. గ్రామంలోని ఐదు ఫిల్టర్ బెడ్స్‌లో ఇప్పటికే నాలుగు ఫిల్టర్ బెడ్స్ మరమ్మతులకు గురి కాగా వాటిని బాగు చేసేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రత్యేక శ్రద్ధతో గ్రామానికి జల్ జీవన్ మిషన్ నిధులు రూ.20లక్షల మంజూరయ్యాయన్నారు. గ్రామంలో తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు జల్ జీవన్ మిషన్ నిధులు ఎంతగానో దోహద పడుతున్నాయన్నారు. ఈ పథకంలో గ్రామంలోని 130 కుటుంబాలకు ఉచితంగా మంచినీటి కుళాయిలను అందించేందుకు అవకాశముంటుందన్నారు. గ్రామంలోని ప్రధాన పైపులైన్ల నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. పసర్పంచ్ పెద్దిరెడ్డి హరిబ్రహ్మానాయుడు, వార్డు సభ్యుడు జగన్‌మోహన్‌రావు, ఎంపీటీసీ గంటా శ్రీనివాసరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ పులిచర్ల వెంకట కృష్ణారావు, మాజీ ఉప సర్పంచ్ పెద్దిరెడ్డి వెంకన్న, వార్డు సభ్యులు, నాయకులు తాడి సుబ్బిరెడ్డి పాల్గొన్నారు.

పంట నష్టం జాబితా ప్రదర్శన



కొవ్వలి ఆర్‌బీకేలో పంట నష్టం జాబితా ప్రదర్శన

దెందులూరు: మండలంలో అన్ని రైతుభరోసా కేంద్రాల్లో పంట నష్టం జాబితాను ప్రదర్శిస్తున్నట్టు దెందులూరు మండల వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్ అన్నారు. మంగళవారం దెందులూరు మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పంట నష్టం జాబితాను ఆయన ప్రదర్శించారు. 1,581 మంది రైతులకు 2,600 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని నివేదికను ప్రభుత్వానికి అందజేశామని రమేష్ వివరించారు.

ఉపాధి పథకంతో అభివృద్ధికి బాటలు

ఏలూరులో మేట్లకు శిక్షణ



శిక్షణకు హాజరైన మేట్లు

ఏలూరు రూరల్: ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల అభివృద్ధికి బాటలు వేయాలని ఏలూరు రూరల్ మండల ఎంఎస్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ కిషోర్ అన్నారు. మంగళవారం రెండో రోజు ఏలూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధి హామీ పథకం మేట్లకు శిక్షణ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గ్రామసభలు నిర్వహించి, ప్రజల భాగస్వామ్యంతో ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకుని కోట్ల రూపాయలతో ఉపాధి హామీ పనులు చేపడుతున్నామని గుర్తుచేశారు. ఈ పనులు చేపట్టడం వల్ల గ్రామీణ ప్రజలకు ఏడాదికి 200 రోజులు ఉపాధి కల్పిస్తున్నామన్నారు. దీనివల్ల ప్రజలు పని చేసుకుని వేతనాలు అందుకుంటూ కుటుంబాలు పోషించుకుంటున్నారని వివరించారు. దీనికి తోడు కూలీలకు చెల్లిస్తున్న వేతనాలకు అనుబంధంగా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న మెటీరియల్ కాంపొనెంట్ నిధులు రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి వెచ్చిస్తోందన్నారు. దీన్ని గుర్తించి నిబంధనల ప్రకారం కూలీలతో పని చేయించాల్సిన బాధ్యత మేట్లపై ఉందన్నారు. ఎప్పటికప్పుడు మారుతున్న నిబంధనలు, పని విధానాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. చేసిన పనికి తగిన వేతనంతో పాటు క్షేత్రస్థాయిలో అభివృద్ధి సైతం కనిపించాలన్నారు. మస్తర్లు, కొలతలు పక్కాగా ఉండాలన్నారు. ఈసీ విజయ్ పరివేక్షణలో జరిగిన సదస్సులో కొలతలు, పని ప్రాంతాల గుర్తింపు, మస్తర్లు వేయడంపై పలువురు తమ అభిప్రాయాలు, అవరోధాలను వెలిబుచ్చి సమాధానం తెలుసుకున్నారు.

మక్కా యాత్ర పుణ్యప్రదం



అబుభాయ్ కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న ఎస్‌ఎంఆర్ పెదబాబు తదితరులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ముస్లింగా పుట్టిన ప్రతి ఒక్కరూ పవిత్ర మక్కా యాత్ర చేయాలనుకుంటారని, కానీ కొందరికే ఆ అవకాశం దక్కుతుందని, మక్కా యాత్ర చేయడం అత్యంత పుణ్యప్రదమని ఏలూరు నగర పాలక సంస్థ కో–ఆప్షన్ సభ్యుడు ఎస్‌ఎంఆర్ పెదబాబు అన్నారు. నగరంలోని ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు మక్కా యాత్రకు వెళుతున్న సందర్భంగా వారిని ఏలూరు అహలెసున్నత్ వల్ జమాత్ ఆధ్వర్యాన స్థానిక గొలుసుల పంజాలో సన్మానించారు. పెదబాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మక్కాతో పాటు మదీనా, ఉమ్రా యాత్రకు బయలుదేరుతున్న నగరానికి చెందిన అబుభాయ్ కుటుంబ సభ్యులను ఆయన సన్మానించారు. మక్కా, మదీనా యాత్రలను అబుభాయ్ కుటుంబ సభ్యులు విజయవంతంగా ముగించుకుని క్షేమంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎండీ ఇలియాస్ పాషా, సబ్బన శ్రీనివాసరావు, అహలెసున్నత్ వల్ జమాత్ అధ్యక్షుడు షేక్ సాబీర్ హుస్సేన్, ప్రచార కార్యదర్శి ఎండీ ఇక్బాల్, సహాయ ప్రచార కార్యదర్శి ఎండీ గాలబ్ అలీ, పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే మత సామరస్యంపై అవగాహన ఉండాలి



సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థి దశలోనే ప్రతి ఒక్కరూ మత సామరస్యంపై అవగాహన కలిగి ఉండాలని ఎంటీఎస్ ఉపాధ్యాయుల సంఘ జిల్లా అధ్యక్షుడు తోట ఎడ్వర్డ్ సూచించారు. ఎడ్వర్డ్ ఆధ్వర్యాన ఎంపీపీ పాఠశాలలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని, దేశంలో ఎన్ని మతాలు ఉన్నా మనుషులంతా సోదరభావంతో మెలగడం ప్రపంచానికి మార్గదర్శకంగా నిలుస్తోందన్నారు. నేటి తరం కూడా మత సామరస్యం కలిగి ఉండి ఇతర మతాలను గౌరవించాలని సూచించారు. అనంతరం ఏసుక్రీస్తు జననంపై చిన్నారులు ప్రదర్శించిన నాటికలు, పాడిన పాటలు విద్యార్థుల తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎం.మాలతీదేవి, బీసీహెచ్ దుర్గాంబ, ఆర్.రామకృష్ణ, డి.రూన్సీ రాణి, ఎ.సనీత తదితరులు పాల్గొన్నారు.

కల్తీపై అవగాహన పెంచుకోవాలి

సత్రంపాడులో వినియోగదారుల సదస్సు



మాట్లాడుతున్న కట్టా సత్యనారాయణ

ఏలూరు రూరల్: వస్తు కొనుగోలుపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కొవ్వలి వినియోగదారులు సేవా మండలి అధ్యక్షుడు కట్టా సత్యనారాయణ సూచించారు. మంగళవారం సత్రంపాడు జెడ్పీ పాఠశాలలో సేవా మండలి ఆధ్వర్యాన వినియోగదారుల హక్కులు, బాధ్యతలతో పాటు 2019 చట్టంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తెలివైన కొనుగోలుదారులుగా వ్యవహరించాలన్నారు. వస్తు రేటు, మన్నిక, గ్యారంటీ, ఉపయోగాలు, వినియోగదారులు పొందే హక్కులను తెలుసుకోవాలన్నారు. 2019 వినియోగదారుల చట్టం ప్రకారం జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రభుత్వాలు కమిషన్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థి దశ నుంచే అవగాహన పెరగాలన్నారు. ఉపాధ్యాయుడు టి.ప్రకాష్ మాట్లాడుతూ కల్తీ వస్తువులను కొనుగోలు చేయడం వల్ల డబ్బు, కాలం వృథాతో పాటు అనారోగ్యపాలై వినియోగదారులు తీవ్రంగా నష్టపోతారన్నారు. పాఠశాల హెచ్‌ఎం కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాలు, పెరుగు, నెయ్యి తదితర ఆహార పదార్థాలతో పాటు ఉపయోగకరమైన వస్తువుల కల్తీపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

చెరువులకు లీజులు నిర్ణయించడం తగదు



మాట్లాడుతున్న చిలకలపల్లి కట్లయ్య

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రజక వృత్తి చెరువులకు పంచాయతీ కార్యదర్శులు నిబంధనలకు వ్యతిరేకంగా లీజులు నిర్ణయించడం తగదని రజక జన సంఘ జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య అన్నారు. స్థానిక ఏటిగట్టు ప్రాంతంలో జరిగిన సంఘ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొన్ని చోట్ల జీవో నెం.3,43లకు వ్యతిరేకంగా లీజులు విధించడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం ధూమంతనగూడెం గ్రామంలో 45 ఏళ్ల క్రితం కేటాయించిన వడ్లమానికుంట చెరువునకు ఒకేసారి 50 శాతం లీజును పెంచడం తగదన్నారు. సుమారు 80 సెంట్లు విస్తీర్ణం గల చెరువుకు రూ.50వేలు లీజు వేయడం అన్యాయమన్నారు. పంచాయతీ, డివిజన్ స్థాయి సమావేశాల్లో ఉన్నతాధికారులు కార్యదర్శులకు తగు ఆదేశాలు జారీ చేయాల్సిందిగా కోరారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల కలెక్టర్లకు రజకుల వృత్తి చెరువుల సమస్యలపై ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా రజక నేతలు వి.శ్రీనివాస్, పొట్లూరు మురళి, ధూమంతనగూడెం రజక నాయకులు పల్లంట్ల పాండు, రాళ్లపూడి శ్రీనివాసు, బలరామకృష్ణ, నవుడూరు రాజేష్, జాలిపూడి శేషు, దేవరపల్లి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



హెల్త్ కార్డులను అందిస్తున్న సర్పంచ్ షేక్ రహీమా బేగం హసేనా, ఎంపీటీసీ అంబటి దేవీ ప్రసాద్

భీమడోలు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా కృషి చేస్తున్నాయని పోలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనా, ఎంపీటీసీ అంబటి దేవి ప్రసాద్ అన్నారు. పోలసానిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ఆరోగ్య సంరక్షణ పథకం హెల్త్ కార్డులను ప్రజలకు అందించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి కుటుంబానికి రూ.ఐదు లక్షలు వైద్య కోసం ఖర్చుపెడుతుందని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకంలో రూ.25లక్షల వరకు వైద్య ఖర్చు పెంచారని తెలిపారు. గ్రామంలో 1,248 హెల్త్ కార్డులను పంపిణీ చేసారు. గ్రామంలోని రెండో వార్డులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనను అందిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల లబ్ధి ప్రజలందరి చెంతకు తీసుకుని వెళ్లిన ఘనత సీఎం జగనన్నకు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కోట శ్రీనివాసరావు, డిజిటల్ అసిస్టెంట్ రాణా, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి పంచదారతో అభిషేకం

ఉంగుటూరు: చేబ్రోలు సుబ్రహమణ్యస్వామికి మంగళవారం 2,222 కిలోల పంచదారతో అభిషేకం చేశారు. 16 జంటలు పీటలపై కూర్చుని సహస్ర పుష్పార్చన నిర్వహించారు. మురళీకృష్ణ బృందంతో భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పావులూరి రాజేష్‌కుమార్ శర్మ, అరుణకుమార్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

పనిచేసే సంస్థల్లో సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న డీఎల్‌ఎస్‌ఏ జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): కార్మికులకు వారు పనిచేసే సంస్థల్లో ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ చెప్పారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యాన స్థానిక సత్రంపాడులోని అంబికా ఇండస్ట్రీస్ నందు కార్మికులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ పనికి తగిన వేతనం చెల్లించాలని, యంత్రాల వద్ద పనిచేసేటప్పుడు తగు రక్షణ చర్యలు తీసుకోవాలని, అసంఘటిత కార్మికులు ఈ–శ్రమ పోర్టల్ నందు తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. దీని ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలకు అర్హులవుతారని తెలిపారు. ప్రభుత్వం అందించే పథకాలను పొందటంలో ఏ విధమైన న్యాయ సహాయం కావాల్సి వచ్చినా జిల్లా న్యాయసేవాధికార సంస్థ అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో అంబికా ఇండస్ట్రీస్ చైర్మన్ అంబికా కృష్ణ, డైరెక్టర్ అంబికా రామాంజనేయులు, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ పి.శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములకు శాశ్వత పరిష్కారం

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- పెదవేగిలో 115 మంది రైతులకు రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ
- ప్రజా ఆశీర్వాద యాత్రకు జన నీరాజనాలు



అసైన్డ్ భూముల రైతులకు రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : రాబోయే ఎన్నికల్లో దెందులూరు నియోజకవర్గం నుంచి 50 వేలకు పైగా మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ధీమా వ్యక్తం చేశారు. పెదవేగి తురాయి చెట్టు వద్ద నుంచి ప్రారంభమైన ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి 6వ రోజు ప్రజా ఆశీర్వాద యాత్రకు స్థానికులు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. ప్రజలతో కలిసి ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి పాదయాత్ర కొనసాగిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి సచివాలయం సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. పెదవేగి తహసీల్దార్ కార్యాలయం వద్ద గ్రామంలోని అర్హులైన 115 మంది లబ్ధిదారులకు అసైన్డ్ భూములకు సంబంధించి పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల సమస్యకు పరిష్కారం చూపిన గౌరవ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపి, లబ్ధిదారులకు ముందే సంక్రాంతి పండుగ వచ్చిందని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పెదవేగి నుంచి న్యాయంపల్లి చేరుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాన్ని అభివృద్ధి చేశారంటూ స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. న్యాయంపల్లిలో రూ.43.60 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ప్రారంభించారు. అనంతరం న్యాయంపల్లి నుంచి కూచింపూడి చేరుకున్నారు. కూచింపూడిలోని ప్రాథమిక పాఠశాలలో రూ.18.50 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను, నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం రామశింగవరం చేరుకుని అక్కడ పార్టీ జెండా ఎగురవేసిన ఎమ్మెల్యే పలువురు నాయకులను వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. అనంతరం పాదయాత్రగా తాళ్ళగోకవరం బస ప్రాంతానికి చేరుకున్నారు. రాత్రికి అక్కడే అక్కడే పల్లె నిద్ర చేయనున్నారు.

250 మంది రైతులకు భూముల రిజిస్ట్రేషన్ పట్టాలు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ 1977 నుంచి అసైన్డ్ భూములున్న రైతులు ఎటువంటి హక్కులు లేకుండా వాటిని సాగు చేస్తూ ఇబ్బంది పడేవారన్నారు. 50 ఏళ్ల నాటి సమస్యకు సీఎం జగన్ చరిత్రాత్మక పరిష్కారం చూపారని అన్నారు. అసైన్డ్ భూముల ధరలు ఇప్పటి వరకూ రూ.10 నుంచి రూ.15 లక్షలున్నాయని, నేడు రిజిస్ట్రేషన్ భూములుగా మారిన తరువాత వాటి విలువ రూ.42 నుంచి రూ.45 లక్షలకు చేరిందన్నారు. నిన్న బాపిరాజు గూడెంలో దాదాపు 250 మంది రైతులకు భూముల రిజిస్ట్రేషన్ పట్టాలను అందించామన్నారు. పెదవేగిలో 115 మంది ఎస్సీ,ఎస్టీ, బీసీ, ఓసీ రైతులకు 150 ఎకరాల భూములకు సంబంధించి పట్టాలు అందించామని ఎమ్మెల్యే చెప్పారు. నియోజక వర్గంలో అర్హులైన ప్రతి అక్క చెల్లెమ్మలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేశామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి 2024లో నిర్వహించనున్న ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పన కనక దుర్గ ప్రసాద్, జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, ఎంపీపీ తాతా రమ్య, ఏపీ ఆయిల్ ఫెడ్ రైతు కమిటీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షుడు, పార్టీ అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కొనసాగిన అంగన్వాడీల సమ్మె

ఏలూరు (టూటౌన్): తమ సమస్యలు పరిష్కరించాలంటూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె 8వ రోజైన మంగళవారం కూడా కొనసాగింది. సమ్మెలో భాగంగా అంగన్వాడీలు స్థానిక జూట్ మిల్లు సెంటర్ నుంచి ర్యాలీగా బయలుదేరి ఏలూరు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. దారి పొడవునా అంగన్వాడీలు భిక్షాటన చేశారు. కలెక్టరేట్ వద్ద రోడ్డుపై బైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తాము ఎదుర్కొంటున్న 10 సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. అంగన్వాడీల సమ్మెకు పలు ప్రజా సంఘాలు, కార్మిక సంఘాల నాయకులు సంఘీభావం తెలియజేశారు. సమ్మెలో ఏలూరు అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు

పెదవేగి : విద్యార్థుల ఇబ్బందిని వివరించగా వెంటనే స్పందించిన తీరుపై విద్యుత్‌శాఖ అధికారులకు పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలియజేశారు. విజయరాయి మండల ప్రాథమిక పాఠశాల వద్ద తుప్పు పట్టిన ఇనుప విద్యుత్ స్తంభం కారణంగా చిన్న పిల్లలకు ప్రమాదకారిగా ఉందని ఎంఈవో అరుణ్ కుమార్ చెప్పగానే స్పందించిన విద్యుత్ ఏడీ శ్రీనివాసరావు 12 గంటల వ్యవధిలోనే పాత ఇనుప స్తంభాన్ని తొలగించి నూతన స్తంభం ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

విశ్వబ్రాహ్మణ సంఘ మండలాధ్యక్షునిగా బ్రహ్మం

ఉంగుటూరు: విశ్వబ్రాహ్మణులు ఐక్యతంగా ఉండాలని ఆ సంఘం అధ్యక్షుడు అనుపోజు వీరబ్రహ్మం అన్నారు. జనాభా దామాషా ప్రకారం రాజకీయ అవకాశాలు కల్పించాలని బ్రహ్మం కోరారు. సమావేశంలో నూతన కమటీని సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అనుపోజు బ్రహ్మం, ఉపాధ్యక్షుడిగా యర్రోజు సుబ్బయ్యచార్యులు, గౌరవ అధ్యక్షుడిగా కవులూరి అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా నెల్లూరి రామపండు, కోశాధికారిగా పుల్లూరి సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంటుగా ఆరిపాక వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా బి. శ్రీనివాసాచార్యులు, కార్యనిర్వహణ కార్యదర్శిగా నిడదవోలు శ్యామ్, డైరెక్టరుగా గురజాపు సురేష్, సభ్యులను ఎన్నుకున్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	24
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	33
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	36
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	16
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	27
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	28
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	33
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	18
ద్వారకాతిరుమల –ఏలూరు– బీహెచ్‌ఈఎల్	22.15	4822	28
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	35
ఏలూరు –తిరుపతి	16.00	4830	31

విద్యుత్ వినియోగంపై అవగాహన సదస్సు

వట్లూరు స్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పెదపాడు: దేశంలోనే విద్యుత్ ఆదా చేయడంలో మన రాష్ట్రం 2వ స్థానంలో నిలిచిందని విద్యుత్ శాఖ ఎస్ఈ పీ సాల్మన్‌రాజు నిలిచిందన్నారు. విద్యుత్ ఆదా చేయడం, వినియోగంపై పెదపాడు మండలంలోని వట్లూరులో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీఈపీడీసీఎల్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎస్ఈ పి.సాల్మన్‌రాజు మాట్లాడుతూ విద్యుత్ ఆదాకు విద్యార్థులు సహకరించాలని కోరారు. విద్యార్థుల ఆలోచనలను భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా ఉండాలని చెప్పారు. విద్యుత్ ఆదా చేయగలమనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు కలెక్టరు చేతులమీదుగా బహుమతులు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నటరాజన్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ త్రివాస్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై రాంబాబు, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పీఎంపీలు సేవాదృక్పథంతో పనిచేయాలి

భీమడోలు: ఏలూరులో ఈనెల 27వ తేదీన పీఎంపీ అసోసియేషన్ 61వ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పీఎంపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.జయరామ్ అన్నారు. భీమడోలులో పీఎంపీ అసోసియేషన్ మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎం.జయరామ్ మాట్లాడుతూ గ్రామాల్లో పీఎంపీలు సేవా దృక్పథంతో పని చేసి గుర్తింపు పొందాలన్నారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్ ఎస్‌కే రంజాన్‌వలి, పీఎంపీలు పాల్గొన్నారు.

ఆడపిల్లల పట్ల వివక్ష చూపరాదు



గణపవరంలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న వైద్యాధికారిణి కిరణ్మయి

గణపవరం: ఆడపిల్లలపై వివక్ష చూపకుండా వారిని కూడా మగ పిల్లలతో సమానంగా చూడాలని దీనిపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి కిరణ్మయి అన్నారు. మంగళవారం గణపవరం పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలను ఉన్నతంగా చదివించాలని, వారి కాళ్లపై వారు నిలబడేలా ప్రోత్సాహం ఇవ్వాలని సూచించారు. ప్రతి రోజూ ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించి, చైతన్యవంతులను చేయాలన్నారు.